

ప్రపంచ పర్యాటకానికి కీర్తి కిరీటం 'గండికోట'

గండికోట రాయలసీమ రాజసానికి నిలువెత్తు నిదర్శనం. అద్భుతమైన నిర్మాణంగా పేరు గడించిన గండికోటను నిర్మించింది మన జిల్లా వాసే. - 8లో



ముగిసిన కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షలు

కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలను గతనెల 30 నుంచి జనవరి 8వ తేదీ వరకు పకడ్బందీగా నిర్వహించారు. - 8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 30.0 /16.2

జిల్లాలో బుధవారం 16.2 - 30.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 0.1 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్.

పాపాఘ్నిలో ఇసుక దొంగలు!

అక్రమాలకు అడ్డ'దారి'

- ఇసుక అక్రమ రవాణాలో అధికార పార్టీ నేతల దోపిడీ
- కమలాపురంలో యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా
- పాపాఘ్నిలోకి రహదారి ఏర్పాటు చేసి తరలిస్తున్న వైనం
- ఫిర్యాదు చేసినా నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్న ఉన్నతాధికారులు

కూటమి సర్కార్‌లో ప్రకృతి వనరులు ధ్వంసమవుతున్నాయి. టీడీపీ ప్రజాప్రతినిధుల అక్రమాదాయకోరల్లో చిక్కి నదులు శల్యమవుతున్నాయి. ఉచిత ఇసుక మాటున ఎక్కడికక్కడ లూటీకి తెరతీశారు. నదుల్ని చెరబెడుతున్నారు. పేరుకే ప్రభుత్వ రీచ్‌లు, పక్కనున్న గ్రామాల నుంచి యథేచ్ఛగా మిషన్లు పెట్టి లోడింగ్ చేస్తూ అక్రమంగా తరలిస్తున్నారు.



మొలకలవారిపల్లె నుంచి భారీ లారీల్లో పట్ట కట్టుకొని ఇసుక తరలిస్తున్న వైనం



అధికారులకు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

సాక్షి ప్రతినిధి, కడప : జిల్లా కేంద్రమైన కడపకు పొరుగునే ఉన్న కమలాపురం నియోజకవర్గంలో ఆకాశమే హద్దుగా ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. కొత్తూరు, పైడికాల్వ, సంబటూరు రీచ్‌లు అధికారికంగా ఉన్నప్పటికీ పక్క గ్రామాల నుంచి ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది. 'ఇసుక ఉచితం' మాటున నదులను గుల్ల చేస్తున్నారు. అక్రమ సంపాదన కోసం ఒకరిని మించి మరొకరు పోటీ పడుతున్నారు. ఈ క్రమంలో జిల్లాలోని చిత్రావతి, పెన్నా, పాపాఘ్ని, చెయ్యేరు నదులపై దండయాత్ర చేస్తున్నారు. ప్రొక్లయిన్ల ద్వారా లోడింగ్ చేస్తూ భారీ టిప్పర్లతో అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. ముఖ్యంగా ప్రభుత్వ రీచ్‌లు దక్కించుకుని పొరుగున్నే ఉన్న మరో గ్రామం నుంచి ఇసుక బాహాటంగా అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. అందుకు ప్రత్యక్ష ఉదాహరణగా కమలాపురం నియోజకవర్గంలోని పైడికాల్వ, కొత్తగంగిరెడ్డిపల్లె, నందిమండలం, సంబటూరు ఇసుక రీచ్‌లు నిలుస్తున్నాయి. ఇక్కడ ప్రభుత్వ ఇసుక రీచ్ నిర్వహణను దక్కించుకున్న టీడీపీ నేతలు ఆ మాటున అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. ఈ నేపథ్యంలో స్థానికంగా వినియోగదారుడికి ఇసుక కావాలంటే చుక్కలు చూడాల్సి వస్తోంది.

అనధికారికంగా ఇసుక అక్రమ రవాణా...

పైడికాల్వ ఇసుక రీచ్‌లో 49,733 మెట్రిక్ టన్నులు ఇసుక ఉన్నట్లు అధికారిక సమాచారం. కాగా, పైడికాల్వ నుంచి కాకుండా రాచవారిపల్లె నుంచి అధికారపార్టీ నేతలు ఇసుక అక్రమంగా తరలిస్తున్నారు. అందుకోసం రాచవారిపల్లె నుంచి పాపాఘ్ని నదిలోకి రహదారి ఏర్పాటు చేశారు. లోడింగ్ కోసం యంత్రాలను ఏర్పాటు చేసి భారీ లారీలతో ఇసుక తరలిస్తున్నారు. అదే పంథాలో మొలకలవారిపల్లె నుంచి కొనసాగిస్తున్నారు. అక్కడ సంబటూరు ఇసుక రీచ్ ఉండగా అక్కడి నుంచి కాకుండా మొలకలవారిపల్లె గ్రామం నుంచి ఇసుక తరలిస్తున్నారు. గ్రామస్తులు అభ్యంతరం చెప్పినా బేఖాతరు చేస్తున్నారు. రెవెన్యూ, మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. ఇదే పరిస్థితి కొత్తగంగిరెడ్డిపల్లె, నందిమండలం ఇసుక రీచ్‌లలో ఉంది. మార్కింగ్ ఇచ్చిన ఏరియాల్లో కాకుండా మరింత ఆవలివైపు నుంచి ఇసుకను తరలిస్తున్నారు. ఇవన్నీ కూడా తెలుగుతమ్ముళ్ల కనుసన్నల్లోనే కొనసాగుతున్నాయి. అయినప్పటికీ అధికారులు అటువైపు పర్యవేక్షణ, పరిశీలన లేకుండా అక్రమార్జనకు అవకాశం కల్పిస్తుండడం గమనార్హం.

ప్రధాన నగరాలకు తరలింపు...

కమలాపురం నియోజకవర్గం నుంచి ప్రధాన నగరాలకు ఇసుక అక్రమంగా తరలిస్తున్నారు. యంత్రాలతో లోడింగ్ చేసి, భారీ వాహనాలల్లో ఇసుక కన్పించకుండా పట్ట కట్టుకొని బెంగుళూరు పట్టణానికి తరలిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇసుక, గ్రావెల్‌తో అక్రమ రవాణాతో కోట్లు కొల్లగొడుతున్నారు. అధికారిక రీచ్‌ల నుంచి కాకుండా పక్కగ్రామాల నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఘటనలు కమలాపురం నియోజకవర్గంలో సాధారణంగా మారాయి. స్వయంగా కలెక్టర్ శ్రీధర్ పరిశీలనలో నందిమండలం వద్ద ఇలాంటి ఘటన వెలుగు చూసినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు లేవనే ఆరోపణలు లేకపోలేదు. ఇప్పటికైనా అక్రమార్కుల నుంచి నదులను రక్షించాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.

సాధారణ చార్జీలతో సంక్రాంతి సర్వీసులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని నడపనున్న బస్సుల్లో సాధారణ చార్జీలతో ప్రయాణీకులను గమ్యస్థానాలకు చేరుస్తామని జిల్లా ప్రజా రవాణాధికారి గోపాల్‌రెడ్డి తెలిపారు. ఈనెల 9వ తేదీ నుంచి సంక్రాంతి సర్వీసులు ప్రారంభమవుతాయన్నారు. పండుగ సందర్భంగా హైదరాబాద్‌కు 111, బెంగళూరు 81, విజయవాడ 30, చెన్నై 12, తిరుపతి, నెల్లూరు, కర్నూలు, అనంతపురానికి 60 బస్సులు నడుస్తాయన్నారు. ప్రజల రద్దీకి అనుగుణంగా మరిన్నిసర్వీసులు నడిపేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. అలాగే ప్రజలు కార్గో సేవలను వినియోగించుకుని సంక్రాంతి కానుకలను పంపుకోవచ్చని ఆయన వివరించారు. ప్రయాణీకులు తమ టిక్కెట్లను ముందుగానే రిజర్వేషన్ చేసుకోవాలని ఆయన సూచించారు.

వార్షిక బ్రహ్మోత్సవాల నిర్వహణకు టెండర్లు

రాయచోటి టౌన్ : రాయచోటిలోని శ్రీ భద్రకాళి సమేత వీరభద్రస్వామి దేవస్థానంలో ఫిబ్రవరి 23 నుంచి మార్చి 5 వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఈ సందర్భంగా దేవస్థానంలో వివిధ పనులు చేయడానికి ఈ నెల 31న ఆలయంలో టెండర్లు నిర్వహిస్తున్నట్లు ఈవో డీవీ రమణారెడ్డి బుధవారం తెలిపారు. గురువారం సాయంత్రం 4గంటల లోపు సీల్డు టెండర్ బాక్స్‌లో వేయాలని చెప్పారు. హిందువులు మాత్రమే పాల్గొనాలని, వీరికి ఎటువంటి దుర లవాట్లు ఉండరాదన్నారు.పాన్, ఆధార్‌కార్డు సీల్డు కొటేషన్‌కు జతపరిచాలన్నారు. టెండరు ఓపెన్ చేశాక అన్యమతస్తులు ఎవరైనా సీల్డు కొటేషన్స్ వేసి ఉంటే తిరస్కరించనున్నట్లు తెలియజేశారు.

న్యూస్‌రీల్

ఉద్యోగాలకు ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన ట్రిపుల్ ఐటీ విద్యార్థులతో డైరెక్టర్, తదితరులు

వేంపల్లె: ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీలో చదువుతున్న 'ఈ4' విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని డైరెక్టర్ ఏవీఎస్. కుమారస్వామి గుప్తా తెలిపారు. బుధవారం స్థానిక ట్రిపుల్ ఐటీలో వివిధ ప్రతిష్టాత్మకమైన కంపెనీలు నిర్వహించిన ప్లేస్‌మెంట్ ఇంటర్వ్యూలలో తమ విద్యార్థులు అత్యంత ప్రతిభను కనబరిచి 30 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. ఎంపికైన వారికి వార్షిక వేతనం రూ.5లక్షల నుంచి రూ.7లక్షల వరకు ఉందని వెల్లడించారు. ప్రముఖ కంపెనీలకు ఎంపిక కావడంపై డైరెక్టర్‌తోపాటు పరిపాలన అధికారి రవికుమార్, ప్లేస్‌మెంట్ కో–ఆర్డినేటర్ వినోద్, ఆఫీసర్ సుందర్ విద్యార్థులను అభినందించారు.

'సౌత్ ఇండియా' సైన్సు ఫేర్‌కు ఎంపిక



విద్యాశాఖ ఉన్నతాధికారుల నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న స్టూడెంట్, గైడ్ టీచర్

కడప ఎడ్యుకేషన్ : పులివెందుల గవర్నమెంట్ హైస్కూల్ మెయిన్‌కు చెందిన విద్యార్థి గౌరీశంకర్, గైడ్ టీచర్ సీవీ ప్రసాద్‌లకు చెందిన సీఓటూ (కార్బన్ డైయాక్సైడ్) కలెక్టర్ ఆట్ ట్రాఫిక్ జోన్ ప్రాజెక్టు సౌత్ ఇండియా సైన్సుఫేర్ పోటీలకు ఎంపికైంది. బుధవారం విజయవాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సైన్సుఫేర్ పోటీలలో వ్యక్తిగత విభాగం కింద ఈ ప్రాజెక్టు ఎంపికైంది. ఈ నెల 20వ తేదీ నుంచి 25వ తేదీ వరకు పాండిచ్చేరిలో నిర్వహించనున్న సౌత్ ఇండియా స్థాయి సైన్సుఫేర్ పోటీలలో ఈ ప్రాజెక్టును ప్రదర్శించనున్నారు. స్టూడెంట్ గౌరీశంకర్, గైడ్ టీచర్ సీవీ ప్రసాద్‌లను డీఈఓ మీనాక్షి, డిప్యూటీ ఈఓ రాజగోపాల్‌రెడ్డి, జిల్లా సైన్సు ఆఫీసర్ వేపరాల ఎబినైజర్ ఇమ్మానియేలు అభినందించారు. సౌత్ ఇండియా స్థాయి సైన్సుఫేర్ పోటీలలో కూడా విజయం సాధించి జిల్లాకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

'పల్లె పండుగ' పనుల్లో జాప్యం తగదు

- జెడ్పీ చైర్ పర్సన్ జేష్టాది శారద




జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశంలో మాట్లాడుతున్న చైర్ పర్సన్ శారద

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలో పల్లె పండుగ కార్యక్రమం కింద చేపట్టిన పనులు నిర్దిష్ట కాలవ్యవధిలో పూర్తి చేయాలని, పనుల్లో జాప్యం తగదని జెడ్పీ చైర్ పర్సన్ జేష్టాది శారద అన్నారు. బుధవారం జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన స్థాయీ సంఘాల సమావేశాలకు ఆమె అధ్యక్షత వహించారు. రహదారి పనుల గురించి ఆరా తీశా రు. ఇందుకు పంచాయతీరాజ్ పర్యవేక్షక ఇంజనీరు జీవీ శ్రీనివాసులురెడ్డి బదులిస్తూ ఉపాధి హామీ కింద జిల్లాలో సీసీ రోడ్లు, మెటల్ రోడ్లు, కాంపౌండ్ వాల్స్ నిర్మాణాలు జరుగుతున్నాయని, ఫిబ్రవరి 15 నాటికి పూర్తవుతాయని తెలిపారు. ఇప్పటికి రూ. 11 కోట్ల చెల్లింపులు జరిగాయన్నారు. కోఆప్షన్ సభ్యులు కరీముల్లా మాట్లాడుతూ ఖాజీపేట నుంచి సుంకేసుల గ్రామం మీదుగా బైపాస్‌రోడ్డు నిర్మించాలని కోరారు. జల జీవన్ మిషన్ కింద జరుగుతున్న పనుల గురించి జెడ్పీ చైర్మన్ అడిగారు. పనులు పురోగతిలో ఉన్నాయని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి బదులిచ్చారు. గండికోట రిజర్వాయర్ నుంచి కమలాపురం నియోజకవర్గానికి, బ్రహ్మంసాగర్ నుంచి కాశినాయన, కలసపాడు, బి.కోడూరు, పోరుమామిళ్ల, బి.మఠం, మైదుకూరు, ఖాజీపేట మండలాలకు తాగునీరు అందించాలన్నది లక్ష్యమన్నారు. అలాగే సోమశిల రిజర్వాయర్ నుంచి బద్వేలు, గోపవరం, అట్లూరు, ఒంటిమిట్ట, సిద్దవటం మండలాలకు నీరందించనున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నుంచి ఇందుకోసం రూ. 2 వేల కోట్లు విడుదలయ్యే అవకాశం ఉందన్నారు. సెంట్రల్ రోడ్డు ఫండ్‌కింద జిల్లాలో ఆరు పనులు చేపట్టగా నాలుగు పూర్తయ్యాయని ఆర్‌అండ్‌బీ ఎస్ఈ తెలిపారు. పోరుమామిళ్ల జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్ మాట్లాడుతూ రూ. 25 కోట్లతో తమ మండలంలో నిర్మిస్తున్న ఆర్‌అండ్‌బీ రోడ్డు పనులు ఎందుకు ఆగిపోయాయని ప్రశ్నించారు. ఇందుకు ఎస్ఈ సమాధానమిస్తూ కాంట్రాక్టర్‌కు నోటీసులు జారీ చేశామని, స్పందన లేకపోతే పనులు కొత్త వారికి అప్పగిస్తామని తెలిపారు. వేంపల్లె జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి మాట్లాడుతూ రాయచోటి-వేంపల్లె ఆర్‌అండ్‌బీ రోడ్డు పనులు నిలిపివేయడం అన్యాయమన్నారు.

హెచ్‌ఎంపీవీపై అప్రమత్తత

హెచ్‌ఎంపీవీ వైరస్ విజృంభణపై ప్రజలు ఆందోళన చెందుతున్నారని, ఈ అంశంపై అవగాహన కల్పించాలని కో ఆప్షన్ సభ్యుడు కరీముల్లా కోరారు. ఇందుకు డీఎంహెచ్ఓ నాగరాజు బదులిస్తూ దీనిపై ఆందోళన చెందాల్సిన పని లేదని స్పష్టం చేశారు. మాస్కులు ధరించడం, చేతులు శుభ్రంగా ఉంచుకోవడం వంటివి చేస్తే సరిపోతుందన్నారు.





ఏడాది పీజీ ప్రవేశాలకు దరఖాస్తులు



ఇంచార్జ్ రిజిస్ట్రార్, ప్రిన్సిపల్, డీన్, ఆచార్యులతో చర్చిస్తున్న వీసీ కృష్ణారెడ్డి

కడప ఎడ్యుకేషన్: యోగి వేమన విశ్వవిద్యాలయం నాలుగేళ్ల ఆనర్స్ డిగ్రీ పూర్తి చేసుకున్న విద్యార్థులకు లెటరల్ ఎంట్రీ విధానంలో ఏడాది పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సులో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని వైస్ చాన్సలర్ ఆచార్య కె. కృష్ణారెడ్డి వెల్లడించారు. జాతీయ విద్యా విధానం–2020 అమలులో భాగంగా నూతనంగా ఏడాది పీజీ కోర్సు (2024–25 విద్యా సంవత్సరం) నోటిఫికేషన్ సందర్భంగా ఆయన తన ఛాంబర్‌లో ఇంచార్జ్ రిజిస్ట్రార్, ప్రిన్సిపల్ ఆచార్య ఏజీ దాము, డీన్‌లతో కలిసి సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యోగి వేమన విశ్వవిద్యాలయ పరిధిలోని అఫిలియేషన్ కలిగిన అనుబంధ కళాశాలలో పీజీ కోర్సులకు అనుమతి ఇచ్చామన్నారు. 2024–25 విద్యా సంవత్సరానికి గాను దరఖాస్తులు కోసం yvu.edu.inను సంప్రదించాలని సూచించారు. వెబ్‌సైట్‌లో విశ్వవిద్యాలయంలో లభించే కోర్సులు, సీట్లు సంబంధిత నిబంధన బ్రోచర్ ఉంటుందన్నారు. 21వ తేదీన విశ్వవిద్యాలయ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్‌లో ప్రవేశాల కౌన్సెలింగ్ ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు నిర్ణీత సమయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

జెడ్పీ సభ్యులకు గౌరవ వేతనం విడుదల

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లా పరిషత్ సభ్యులకు గౌరవ వేతనం విడుదల చేశామని జెడ్పీ సీఈఓ ఓబులమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికిగాను 3, 4వ త్రైమాసిక బడ్జెట్‌ను ప్రభుత్వం విడుదల చేసిందని పేర్కొన్నారు. ఈ మేరకు జెడ్పీ చైర్మన్, జెడ్పీటీసీలు, కో ఆప్షన్ సభ్యుల గౌరవ వేతనం రూ. 27,58,491లు విడుదలైందన్నారు. ఎంపీటీసీలు, కో ఆప్షన్ సభ్యులు, మండల ప్రజాపరిషత్ అధ్యక్షుల గౌరవ వేతనం రూ. 1,62,14,186 ప్రభుత్వం విడుదల చేసిందని వివరించారు.

12న జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని డీఎస్ఏ క్రీడా మైదానంలో ఈనెల 12వ తేదీన నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు నెహ్రూ యువకేంద్రం జిల్లా కో–ఆర్డినేటర్ మణికంఠ తెలిపారు. స్వామి వివేకానందుని జయంతి సందర్భంగా జాతీయ యువజనోత్సవం పురస్కరించుకుని ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 15 నుంచి 29 ఏళ్లలోపు వారు యువ క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు. పూర్తి వివరాలకు 9398391912 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.



వైకుంఠ దర్శనాలకు సర్వం సిద్ధం

- రేపే వైకుంఠ ఏకాదశి
- ఆలయాల్లో విశేష ఏర్పాట్లు



శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి

కడప కల్చరల్ : వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని జిల్లాలోని ప్రముఖ ఆలయాలలో శుక్రవారం అలంకారాలు, విశేష పూజలు నిర్వహించనున్నారు. ముఖ్యంగా వైకుంఠ ఏకాదశి నాడు ఉత్తర ద్వారం నుంచి ఆయా దేవాలయాల్లోని దేవతామూర్తులను దర్శించుకుంటే వైకుంఠం ప్రాప్తిస్తుందన్నది వైష్ణవ భక్తుల విశ్వాసం. ధనుర్మాసం సందర్భంగా వీరంతా నిత్యం ఉదయం, సాయంత్రం పాశురాల గానం చేస్తూ భక్తితో ఉంటారు. దీనికి ముగింపుగా వైకుంఠ ఏకాదశి రావడంతో భక్తుల్లో పాశురాల ముగింపుతోపాటు వైకుంఠ దర్శనాలు ఉంటాయి. ఈ సందర్భాన్ని పవిత్రమైనదిగా భావిస్తున్నారు.

- ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయం రాష్ట్ర లాంఛనాల హోదా కలిగి ఉండడంతో ఇక్కడి ప్రతి పూజోత్సవానికి విశేషమైన ప్రత్యేకత ఉంటోంది. ప్రత్యేకంగా జిల్లాలో మూడు గోపురాలు గల ఆలయాలలో ఈ ఆలయం ప్రథమ స్థానంలో ఉంది. ఏటా వైకుంఠ ఏకాదశి నాడు మాత్రమే ఈ ఆలయం ఉత్తర ద్వారాన్ని తెరుస్తారు. భక్తుల కోసం ఇప్పటికే ఆ ద్వారం గుండా లోనికి వెళ్లేందుకు ప్రత్యేకమైన ఏర్పాట్లు చేస్తున్నారు. టెంపుల్ విలేజ్‌గా పేరుగాంచిన పుష్పగిరిలోని శ్రీ చెన్నకేశవస్వామి ఆలయంలో కూడా ఉత్తర ద్వార దర్శనం కల్పించనున్నారు.
- దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి కొలువై ఉన్న దేవునికడపలో నూతన సంవత్సర సందర్భంగా భక్తుల కోసం ప్రత్యేకమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి తెలిపారు. భక్తులకు దేవతామూర్తుల సులభ దర్శనమయ్యేలా ప్రత్యేకంగా క్యూలైన్లను ఏర్పాటు చేయనున్నారు. తిరుమల–తిరుపతి దేవస్థానాల ఆధ్వర్యంలో నడుస్తున్న జమ్మలమడుగు శ్రీ నారాపుర వెంకటేశ్వరస్వామి ఆలయం, గండి వీరాంజనేయస్వామి ఆలయం, నందలూరు శ్రీ సౌమ్యనాథస్వామి ఆలయం, తాళ్లపాక, బద్వేలు, రాజంపేట, చిట్వేలి, ప్రొద్దుటూరు తదితర ప్రాంతాల్లోని శ్రీ వెంకటేశ్వరస్వామి, శ్రీ రామాలయాలలో కూడా ఉత్తర ద్వార దర్శన సౌకర్యం కల్పించనున్నారు.



క్లుప్తంగా

హేమలతకు డాక్టరేట్


దుద్దేకుంట హేమలత

కడప ఎడ్యుకేషన్‌ : పర్యావరణ సహిత మానవ శరీరంలో ఔషధ సరఫరా, గాయాలను త్వరితగతిన నయం చేయడానికి నానో డ్రగ్‌ కనుగొన్న రసాయన శాస్త్ర శాఖ స్కాలర్‌ దుద్దేకుంట హేమలత కు యోగి వేమన విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ ను ప్రకటించింది. పులివెందుల పట్టణం భాకరాపురానికి చెందిన డి. రవిశేఖర్‌, కృష్ణమ్మల కుమార్తె హేమలత రసాయన శాస్త్ర విభాగ ఆచార్యులు కె.ఎస్‌.వి. కృష్ణారావు పర్యవేక్షణలో ×సింథసిస్‌ అండ్‌ క్యారెక్టరైజేషన్‌ ఆఫ్‌ పాలి శాఖరాయిడ్‌ బేస్డ్‌ హైడ్రోజెన్స్‌ ఫర్‌ కంట్రోల్‌ రిలీజ్‌ ఆఫ్‌ కీమో థెరపీ ఏజెంట్స్‌ అండ్‌ యాంటీ మైక్రోబియన్‌ అప్లికేషన్‌× అనే అంశంపై పరిశోధన చేసిన సిద్ధాంత గ్రంథం విశ్వవిద్యాలయానికి సమర్పించారు. డి. హేమలతకు డాక్టరేట్‌ సర్టిఫికెట్‌ ను వైవీయూ పరీక్షల నిర్వహణ అధికారి ఆచార్య కె.ఎస్‌.వి. కృష్ణారావు జారీ చేశారు.

మల్లెపూల తోట దగ్ధం

కమలాపురం : మండల పరిధిలోని జీవంపేట గ్రామంలో మల్లెపూల తోటను గుర్తు తెలియని దుండగులు దగ్ధం చేసినట్లు రైతు నవనీశ్వర్‌ రెడ్డి తెలిపాడు. కొండాయపల్లెకు చెందిన రైతు 1.5 ఎకరాల పొలం కౌలుకు తీసుకుని అందులో మల్లెతోట సాగు చేశాడు. బుధవారం పొలం వద్దకు వెళ్లి చూసే సరికి తోట దగ్ధం అయింది. దాదాపు రూ.3లక్షల వరకు నష్టం వాటిల్లిందని రైతు వాపోయాడు.

బైక్‌ దొంగ అరెస్టు

కమలాపురం : వరుస ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడిన అంతర్‌ జిల్లా దొంగను అరెస్టు చేసినట్లు కమలాపురం సీఐ ఎస్‌కే రోషన్‌, ఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక పోలీస్‌ స్టేషన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు బైక్‌ దొంగతనాలకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. కమలాపురం–ఖాజీపేట రహదారిలో పాగేరు వంక వద్ద తచ్చాడుతూ తిరుగుతున్న ఖాజీపేట మండలం తుడుములదిన్నె గ్రామానికి చెందిన కూకట్లపల్లి భరత్‌ కుమార్‌ను బుధవారం పట్టుకుని విచారించామన్నారు. ఇటీవల 3 బైక్‌లను దొంగిలించడమే కాకుండా గతంలో కూడా బైక్‌లు దొంగలించినట్లు ఒప్పుకున్నాడన్నారు. గత నెల 28వ తేదీన తాడిపత్రిలో ఎఫ్‌జడ్‌ఎస్‌, 30వ తేదీన కమలాపురంలో ప్లాటిన, ఈ నెల 3వ తేదీన రైల్వేకోడూరులో హెచ్‌ఎఫ్‌ది డీలక్స్‌ బైక్‌లను దొంగిలించాడన్నారు. గతంలో కూడా అతనిపై జమ్మలమడుగు, ఖాజీపేటలో 3 కేసులు నమోదయ్యాయని తెలిపారు. అతని వద్ద నుంచి ఇటీవల దొంగిలించిన 3బైక్‌లను స్వాధీనం చేసుకున్నామన్నారు.

ప్రపంచ పర్యాటకానికి కీర్తి కిరీటం ‘గండికోట’

- చారిత్రక భౌగోళిక అంశాలు ప్రత్యేకం
- యునెస్కో గుర్తింపు కోసం చురుగ్గా యత్నాలు
- ప్రచార లోపంతో మసకబారిన ప్రాభవం
- నేడు కోట ఆవిర్భావ దినోత్సవం



కడప కల్చరల్‌ : ప్రపంచ వ్యాప్తంగా ఒక అద్భుతమైన నిర్మాణంగా పేరు గడించిన గండికోటను నిర్మించింది మన కడప జిల్లాకు చెందిన వాడేనంటే ఆశ్చర్యంగా ఉంది కదూ...అవును గండికోట రాయలసీమ రాజసానికి నిలువెత్తు నిదర్శనం. సీమ వాసులు గర్వంగా భావించే చారిత్రక వారసత్వ ఆనవాలు. వన, గిరి, జల దుర్గంగా, భూ వైజ్ఞానిక ప్రాంతంగా చూడటానికి రెండుకళ్లు చాలవన్నట్లుగా ఈ కోట నిన్నటి చరిత్రకు నిదర్శనంగా ఉంది. ఇది మన జిల్లాకు చరిత్ర ప్రసాదించిన అమూల్యమైన వరం. నేడు గండికోట ఆవిర్భావ దినోత్సవం. ఈ సందర్భంగా కడప కైఫీయత్‌ల ఆధారంగా ఈ చారిత్రక నిర్మాణం గురించి విశేషాలు క్లుప్తంగా..

కడప జిల్లా జమ్మలమడుగు పట్టణానికి 14 కిలోమీటర్ల దూరంలో పెన్నానదికి కుడివైపున ఈ కోటను 1123 జనవరి 9న కల్యాణి చాళుక్యరాజు త్రైలోక్యమల్లుని సామంతుడు కాకరాజు నిర్మించాడు. సమీపంలోని బొమ్మేపల్లెకు చెందిన కాకరాజు (చిద్దనచోళ మహారాజు) నిర్మించిన కోట ఈ ప్రాంతపు చారిత్రక నిర్మాణంలో ఒక అద్భుతంగా చరిత్రకారులు భావిస్తారు. పలు కోణాలలో ఈ కోట నేటికీ తన ఆధిపత్యాన్ని, ప్రత్యేకతలను చాటుకుంటోంది. 1279 నాటి అత్తిరాల శాసనంలో గండికోట గురించిన ప్రస్తావన తొలిసారిగా కనిపిస్తోంది. కోట గురించిన ఇంకా పలు విశేషాలు గల శాసనాలు పలుచోట్ల లభించాయి.

పెన్నానది ఈ ప్రాంతంలోని ఎర్రమల కొండను నిలువునా చీలుస్తూ ప్రవహిస్తుంది గనుక దీన్ని గండికోట అని వ్యవహరిస్తున్నారు. నదికి పశ్చిమ, ఉత్తర దిశల్లో శత్రు దుర్భేద్యంగా నిలిచిన ఈ కోటను పునాదులు లేకుండానే నిర్మించడం, అందులో పలు రహస్య మార్గాలను ఏర్పాటు చేయడం విశేషం. ఇక్కడ పెన్నానది గండికోటను చుట్టుకున్నట్లుగా కోటకు సహజంగా అమరిన పచ్చల నీలాల హారంగా అమరి చూపరులను కట్టి పడేస్తోంది. ఈ ప్రవాహానికి 90 మీటర్ల ఎత్తులో కోట నాటి వైభవానికి నిదర్శనంగా గంభీరంగా నిలిచి ఉంది.

భారీ నిర్మాణం

కోట పొడవు తూర్పు నుంచి పడమర వరకు 1200 మీటర్లు పొడవు, 800 మీటర్లు వెడల్పుగా ఉంది. ఒకప్పుడు ఈ కోటలో 101 బురుజులు ఉండేవని తెలుస్తోంది. కోటకు చుట్టూ మూడు వరుసల బలమైన గోడలు ఉన్నాయి. గోడల నిర్మాణంలో టన్ను బరువు ఉండే ఎర్రశానపు రాళ్లను వాడారు. కోటకు తూర్పు దిశలో ప్రధాన ద్వారం ఉంది. పడమట పెన్నా లోయలో మెట్ల మార్గం ఉంది. ఇంకా కొన్ని రహస్య మార్గాలు కూడా కోటలో ఉన్నాయి. దీనికి నైరుతి, దక్షిణం వైపున కందకాలు ఉన్నాయి. కోటలోకి శత్రువులు చొరబడకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుని నిర్మించారు. బురుజుల నుంచి కోట వెలుపల చాలా దూరం వరకు శత్రువుల కదలికలను గమనించే సౌకర్యం ఉంది. అందుకే మీర్‌జుమ్లా దీన్ని వశం చేసుకునేందుకు పెద్ద సైన్యంతో మూడు నెలలకు పైగా శ్రమించాల్సి వచ్చింది. పెన్నానదిలో ఆనాడే గొట్టపు మార్గం ద్వారా కోటలోకి నీటి సౌకర్యం కల్పించారు. గండికోట విజయనగర సామ్రాజ్య కాలంలో వారికి సామంత రాజ్యంగా ఉండింది. బుక్కరాయలు కుమారుడు రెండవ దేవరాయలు(ప్రౌఢ దేవరాయలు) కాలం నుంచి గండికోటపై పెమ్మసాని వంశీకుల ప్రాతినిధ్యం పెరిగింది. ఆ వంశంలోని చినతిమ్మానాయుడు, ఆయన సోదరి గోవిందమాంబలు అరివీర భయంకరులుగా పేరుగాంచారు. నాడు పెన్నానది తీరమంతా వజ్రాలు లభించేవి గనుక గండికోట వజ్రాల వ్యాపారానికి ప్రధాన కేంద్రంగా ఉండేది. అందుకే మీర్‌ జుమ్లా దండయాత్ర చేశారని ఫ్రెంచ్‌ యాత్రికుడు, వజ్రాల వ్యాపారి టావెర్నియర్‌ కోటను సందర్శించిన సందర్భంగా పేర్కొన్నాడు. దీన్ని రెండవ హంపిగా వర్ణించాడు. ముస్లిం పాలకుల హయాంలో కోటలో పలుచోట్ల వారి సంప్రదాయ శైలిలో నిర్మాణాలు సాగాయి. కోటలోని ప్రముఖ నిర్మాణమైన జుమ్మా మసీదుతోపాటు ఇతర ప్రముఖ నిర్మాణాలు వారి పాలనలోనే వెలిశాయి. జుమ్మా మసీదు వెనుక పెద్ద ఎత్తున కత్తులు, మర ఫిరంగులు తయారు చేసే ఆయుధాగారం ఉండేది. 1791లో టిప్పు సుల్తాన్‌ నుంచి కోట ఆంగ్లేయుల స్వాధీనమైంది.

సంధ్యా సమయంలో

ఇక్కడి భవనాలు, బురుజుల పైనుంచి సూర్యోదయం, సూర్యాస్తమయాలను పెన్నానది మీదుగా తిలకించడం గొప్ప అనుభూతిగా పర్యాటకులు పేర్కొంటున్నారు. ఈ దృశ్యాలను చూసేందుకు దేశం నలుమూలల నుంచి వచ్చే పర్యాటకులు ఆ సమయానికి అక్కడికి చేరుకుని అందమైన ఆ దృశ్యాలను కెమెరాలు, వీడియోల్లో రికార్డు చేసుకుంటున్నారు. కోట సందర్శన సందర్భంగా గొప్ప అనుభూతి ఇచ్చే అంశాలలో ఇది ఒకటని భావిస్తారు. ఇక్కడి చారిత్రక ప్రదేశాలు, పురాతన ఆలయాలతో కూడిన ప్రాంతాలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. అందువల్లే దక్షిణ ప్రాంత సినిమాల షూటింగ్‌లు తరుచూ ఇక్కడ చిత్రీకరిస్తున్నారు. ఇతర ప్రాంతాల్లో స్థిరపడ్డ గండికోట వారసులు నేటికీ ఆ ప్రాంతంలో జరిగే జాతర్లకు హాజరవుతూ ఉంటారు. కోటను తరుచూ సందర్శిస్తుంటారు. కోట ప్రాంతాన్ని పర్యాటకులకు అన్ని వసతులతో అభివృద్ధి చేస్తే పర్యాటకంగా ఇది ప్రపంచ పటంలో ప్రముఖ స్థానం ఆక్రమించగలదని పర్యాటకాభిమానులు పేర్కొంటున్నారు.



గండికోట ప్రవేశ ద్వారం

పీడీఎస్‌ బియ్యం పట్టివేత

వేముల : మండలంలోని మీదిపెంట్ల గ్రామం బక్కన్నగారిపల్లెకు వెళ్లే దారిలో ఉన్న రేకుల షెడ్డులో నిల్వ ఉంచిన పీడీఎస్‌ రేషన్‌ బియ్యాన్ని విజిలెన్స్‌ అధికారులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. బుగ్గపట్నం మండలం కృష్ణాపురం పంచాయతీ గోవులాపురం గ్రామ తాండాకు చెందిన లక్ష్మీప్రసాద అనే వ్యక్తి తన యజమాని తుమ్మల మిత్రమ నాయుడుతో కలిసి పీడీఎస్‌ బియ్యాన్ని వేముల, వేంపల్లె చుట్టూ గ్రామాల నుంచి సేకరించి అక్రమంగా నిల్వ ఉంచి రవాణాకు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో అక్రమ బియ్యం నిల్వ ఉన్నట్లు సమాచారం రావడంతో తనిఖీ చేయగా, 93 బస్తాల పీడీఎస్‌ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.2,20,938లు ఉందన్నారు. రేషన్‌ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని పులివెందుల సీఎస్‌డీటీ సుధీర్‌కు అప్పగించామని విజిలెన్స్‌ అధికారులు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేశామన్నారు. ఈ తనిఖీలలో విజిలెన్స్‌ అధికారులు నారాయణప్ప, శివన్న, బాలగంగాధరరెడ్డి, సుధీర్‌, రంతుబాషా, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడికి గాయాలు

వేముల : వేముల సమీపంలోని వాటర్‌ ప్లాంటు వద్ద బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో విఘ్నేష్‌ అనే బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక వెంకటేశ్వర స్వామి ఆలయంలో పనిచేస్తున్న పూజారి కొడుకు స్కూటీపై వెళుతుండగా పులివెందుల వైపు నుంచి పూలను తీసుకెళుతున్న బొలేరో వాహనం వెనుకవైపు నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో విఘ్నేష్‌కు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం పులివెందుల ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు బాలుడి పరిస్థితి విషమంగా ఉందని చెప్పడంతో కుటుంబ సభ్యులు బాలుడిని కడపలోని ఓ ప్రైవేట్‌ ఆసుపత్రికి తరలించారు. ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన బొలేరో వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

మురుగు కాలువలో పడి ఆర్టీసీ డ్రైవర్‌ మృతి

సింహాద్రిపురం : మండలంలోని పల్లవోలు గ్రామానికి చెందిన ఆర్టీసీ డ్రైవర్‌ మిండ్యాల వెంకటేశ్వర్లు(59) అనే వ్యక్తి బుధవారం మురుగు కాలువలో పడి మృతి చెందాడు. గ్రామస్తులు, కుటుంబీకులు తెలిపిన వివరాల మేరకు.. వెంకటేశ్వర్లు బుధవారం సాయంత్రం ఇంటి ఎదురుగా ఉన్న అరుగుపై నిద్రిస్తుండగా నిద్రమత్తులో ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న మురుగు కాల్వలో పడిపోయాడు. కాల్వలో పడిపోయిన వెంకటేశ్వర్లును స్థానికులు గుర్తించి బయటికి తీసి చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి వివాహితులైన ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.


మురుగు కాలువలో పడి మృతి చెందిన వెంకటేశ్వర్లు

బియ్యం అక్రమ తరలింపుపై ఉక్కుపాదం

రాయచోటి : రేషన్‌ బియ్యం అక్రమ తరలింపుపై పోలీసులు, రెవెన్యూ అధికారులు ఉక్కుపాదం మోపారు. అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలోని ఓ రైస్‌ మిల్లులో తరలింపునకు సిద్ధంగా ఉన్న 350 క్వింటాళ్ల (700 ప్యాకెట్లు) పీడీఎఫ్‌ బియ్యాన్ని స్పెషల్‌ పార్టీ పోలీసులు మంగళవారం అర్ధరాత్రి గుర్తించారు. పట్టుబడిన బియ్యం సమాచారాన్ని జేసీ ఆదర్శ రాజేంద్రన్‌కు తెలిపారు.

భార్య, కుమార్తెల హత్య కేసులో నిందితుడి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న రూరల్‌ సీఐ రమణ

పులివెందుల రూరల్‌ : పులివెందుల నియోజకవర్గం తొండూరు మండలం టి.తుమ్మలపల్లె గ్రామంలో మంగళవారం రాత్రి భార్య, కూతురిని హత్య చేసిన కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. గంగాధర్‌ రెడ్డి అనే వ్యక్తి భార్య శ్రీలక్ష్మి, కూతురు గంగోత్రిలతో గొడవపడి మద్యం తాగడానికి డబ్బులు ఇవ్వలేదని వారిని అతికిరాతంగా హత్య చేశాడని రూరల్‌ సీఐ రమణ పేర్కొన్నారు. బుధవారం స్థానిక రూరల్‌ పోలీస్‌ స్టేషన్‌లో ఆయన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. తుమ్మలపల్లె గ్రామానికి చెందిన తుమ్మల గంగాధర్‌ రెడ్డి కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. రోజు మద్యం తాగి వచ్చి తన భార్యతో గొడవ పడుతుండేవాడు. రోజు మాదిరిగానే మంగళవారం మద్యం సేవించి ఇంట్లో ఉన్న భార్య శ్రీలక్ష్మి, కూతురు గంగోత్రిలతో మద్యం తాగడానికి డబ్బులు ఇవ్వాలని వారితో గొడవపడ్డాడు. అర్ధరాత్రి ఒంటిగంట ప్రాంతంలో నిద్రిస్తున్న భార్య తలపైన ఇంట్లో ఉన్న పైపులు తీసుకుని కొట్టాడు. నిద్రనుంచి లేచి అడ్డుపడిన కూతురు గంగోత్రిని కూడా అదే ఇనుప పైపుతో తలపై రెండు, మూడు సార్లు బలంగా కొట్టాడు. ఆ తర్వాత ఇద్దరిని ఇంట్లో ఉన్న మచ్చుకత్తితో ముందుగా భార్య శ్రీలక్ష్మీని, తర్వాత కుమార్తె గంగోత్రిని నరికేశాడు. ఈ కేసులో నిందితుడిగా ఉన్న గంగాధర్‌ రెడ్డిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపామన్నారు.

వైఎస్‌ కుటుంబం కృషితోనే ఉత్తరాంధ్ర అభివృద్ధి

- జగనన్న అనుమతులు తెచ్చిన పనులకు ప్రధానితో శంకుస్థాపనలు
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌ సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌ రెడ్డి

కమలాపురం : ఉత్తరాంధ్ర అభివృద్ధి జరిగింది కేవలం వైఎస్‌ కుటుంబంతోనే అని వైఎస్సార్‌ సీపీ వైఎస్సార్‌ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌ రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం వైఎస్సార్‌ జిల్లా కమలాపురంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్తరాంధ్ర పై చంద్రబాబు కపట ప్రేమ చూపిస్తున్నాడని, మహానేత వైఎస్సార్‌, మాజీ సీఎం వైఎస్‌ జగన్‌ మోహన్‌ రెడ్డితోనే ఆ ప్రాంతం అభివృద్ధి చెందిందన్నారు. వైఎస్‌ జగన్‌మోహన్‌ రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో అనుమతులు తెచ్చిన పనులను ప్రధాని మోదీ చేతుల మీదుగా శంకుస్థాపన చేయించడం సిగ్గుచేటన్నారు. ఏవరో కన్న బిడ్డను తన బిడ్డగా ఎత్తుకుని ముద్దు పెట్టుకున్నట్లు చంద్రబాబు పనితీరు ఉందని దుయ్యబట్టారు. ఉద్దానంలో కిడ్నీ సమస్యలు ఉండకూడదని రూ.700 కోట్లతో రీసెర్చ్‌ సెంటర్‌ పెట్టడమే కాక అత్యాధునిక వసతులతో ఆసుపత్రి నిర్మాణం, పైప్‌లైన్‌ ఏర్పాటు చేసిన ఘనత జగనన్నదే అన్నారు. రైల్వే జోన్‌, భోగాపురం ఎయిర్‌ పోర్టు, ఎన్‌టీపీసీ ప్రస్తుతం భూమి పూజ చేస్తున్న బల్క్‌ డ్రగ్‌ హబ్‌, గ్రీన్‌ హైడ్రోజన్‌ హబ్‌ తదితర వాటికి అనుమతులు తెచ్చిందీ జగనన్నే అని గుర్తు చేశారు. భోగాపురం ఎయిర్‌పోర్ట్‌పై అనేక ఏళ్ల నుంచి ఉన్న కోర్టు కేసులను పరిష్కరించి, భూ బాధితులకు నష్ట పరిహారం అందించి ఎయిర్‌పోర్ట్‌ నిర్మాణానికి లైన్‌ క్లియర్‌ చేయడంతో పాటు ప్రహరీ నిర్మించింది జగనేనని స్పష్టం చేశారు. అలాగే మూలాపేట పోర్టు పనులు చేపట్టింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనన్నారు. విజయనగరం, పాడేరులో మెడికల్‌ కాలేజీలు జగనన్న ఏర్పాటు చేస్తే వాటిలో అడ్మిషన్లు లేకుండా చేసిన ఘనత చంద్రబాబుకు దక్కుతుందన్నారు. కూటమి ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా వైజాగ్‌ స్టీల్‌ ప్లాంట్‌ను ప్రైవేటీకరించబోమని ప్రధాని చేత ప్రకటన చేయించాలని ఆయన డిమాండ్‌ చేశారు. అప్పట్లో ప్రధాని ఎదుటే అభివృద్ధి చేసే పార్టీలవైపే తాము ఉంటామని జనగన్న చెప్పారని, ప్రస్తుతం ఎన్‌డీఏతో అంటకాగుతున్న చంద్రబాబు ప్రధాని సమక్షంలో అలా చెప్పగలరా? అని ప్రశ్నించారు. సమ్మిట్‌ ద్వారా ఉత్తరాంధ్రకు సాఫ్ట్‌వేర్‌ కంపెనీలు తీసుకొచ్చి 3వేల మందికి ఉపాధి అవకాశాలు కల్పించిన ఘనత జగనన్నదేనన్నారు. వీహెచ్‌పీపీ మూసివేస్తున్న తరుణంగా మహానేత వైఎస్‌ రాజశేఖర్‌రెడ్డి ఆ పరిశ్రమను బీహెచ్‌ఈఎల్‌లో విలీనం చేసి దాని అభివృద్ధికి కృషి చేశారన్నారు. హిందుస్థాన్‌ షిప్‌యార్డ్‌ను అభివృద్ధి చేసిన ఘనత కూడా వైఎస్సార్‌కు దక్కుతుందన్నారు. వైజాగ్‌ స్టీల్‌ ప్లాంట్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు జగనన్న మాస్టర్‌ ప్లాన్‌ రూపొందించారన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌ సీపీ నాయకులు ఉత్తమారెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, సంబటూరు ప్రసాద్‌రెడ్డి, గంగాధర్‌ రెడ్డి, సుధా కొండారెడ్డి, మహ్మద్‌ సాదిక్‌, మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి, జగన్‌మోహన్‌ రెడ్డి, దేవదానం, శరత్‌బాబు, గండి భాస్కర్‌ తదితరులు పాల్గొన్నారు.


ద్విచక్రవాహనం అదుపు తప్పి ప్రభుత్వ ఉద్యోగి మృతి


రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన శ్రీనివాసులరెడ్డి


తొండూరు : తొండూరు ఎంపీడీఓ కార్యాలయంలో సీనియర్‌ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కోకటం శ్రీనివాసులరెడ్డి(52) ద్విచక్ర వాహనం అదుపు తప్పి అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికుల కథనం మేరకు.. బుధవారం శ్రీనివాసులరెడ్డి సైదాపురం నుంచి కోవరంగుంటపల్లెకు వ్యక్తిగత పనులమీద వెళ్లారు. తిరిగి స్వగ్రామమైన సైదాపురానికి వస్తుండగా, గ్రామ సమీపంలోని చీనీ తోట వద్దకు రాగానే బైకు అదుపు తప్పి గుంతలో పడటంతో కిందపడ్డారు. దీంతో శ్రీనివాసులరెడ్డి బండ రాయిపై పడటంతో తలకు బలమైన రక్తపు గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న సైదాపురం గ్రామస్తులు, బంధువులు ఘటనా స్థలానికి చేరుకుని ఆవేదన చెందారు. ఈ ఘటనపై తొండూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన కానిస్టేబుల్‌ దేహదారుఢ్య పరీక్షలు

- తుది పరీక్షకు 1685 మంది ఎంపిక
- పర్యవేక్షించిన జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్‌ నాయుడు


దేహ దారుఢ్య పరీక్షలను పర్యవేక్షిస్తున్న జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్‌ నాయుడు

కడప అర్బన్‌ : పోలీసు కానిస్టేబుల్‌ నియామక ప్రక్రియలో భాగంగా దేహ దారుఢ్య పరీక్షలను గతనెల 30 నుంచి జనవరి 8వ తేదీ వరకు కడప నగర శివార్లలోని పోలీసు శిక్షణా కేంద్రంలో పకడ్బందీగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్‌ నాయుడు ఆదేశాల మేరకు జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్‌)కె. ప్రకాష్‌బాబు, ఏఆర్‌ అదనపు ఎస్పీ బి. రమణయ్య, డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు, డీపీఓ, ఐటీకోర్‌, ఏఆర్‌ సిబ్బంది సహకారం అందించారు. చివరిరోజున 312 మంది దేహదారుఢ్య పరీక్షలకు హాజరుకాగా, వీరిలో 167 మంది ఎంపికయ్యారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 4492 మంది హాజరు కావాల్సి ఉండగా 2968 మంది హాజరయ్యారు. వీరిలో తుది పరీక్షకు 1685 మంది ఎంపికయ్యారు. వీరిలో 1472 మంది పురుషులు, 213 మంది మహిళా అభ్యర్థులు ఉన్నారు.


పరుగు పందెంలో పాల్గొన్న మహిళా అభ్యర్థులు

సీమకే తలమానికం అన్నమాచార్య విశ్వవిద్యాలయం

రాజంపేట : రాయలసీమకే అన్నమాచార్య విశ్వవిద్యాలయం తలమానికంగా నిలుస్తోందని రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథ రెడ్డి అన్నారు. బుధవారం రాత్రి ఏయూ క్యాంపస్‌లో రెండవ రోజు ఏర్పాటు చేసిన ఏఐటీఎస్‌ సిల్వర్‌ జూబ్లీ ఉత్సవాలను ఏయూ చాన్స్‌లర్‌ చొప్పా గంగిరెడ్డి, ప్రో చాన్స్‌లర్‌ చొప్పా అభిషేక్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎందరో విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాట వేసే విధంగా ఏఐటీఎస్‌ ముందుకు వచ్చిందన్నారు. రాజంపేట ప్రాంతం విద్యాహబ్‌గా మారేందుకు ఏయూ మార్గదర్శకంగా నిలవాలన్నారు. ఏరోనాటికల్‌ సొసైటీ ఆఫ్‌ ఇండియా ప్రెసిడెంట్‌ డాక్టర్‌ జి.సతీష్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకత, పట్టుదల, నైతిక విలువలు పెంపొందించేందుకు ఏయూ వేస్తున్న అడుగులు అద్భుతనీయమన్నారు. ఏయూ చాన్స్‌లర్‌ చొప్పా గంగిరెడ్డి మాట్లాడుతూ వివిధ రంగాలలో రాణించిన 25 మంది ప్రముఖలకు ఏయూ రెసోనన్స్‌ అవార్డులను అందజేసి సత్కరించడం గర్వకారణంగా ఉందన్నారు. ఏయూ ప్రో చాన్స్‌లర్‌ చొప్పా అభిషేక్‌రెడ్డి మాట్లాడుతూ అన్నమాచార్య యూనివర్సిటీ కేవలం విద్యకే పరిమితం కాకుండా సామాజిక సేవలో కూడా ఏయూ ముందుకు దూసుకెళుతోందన్నారు. కార్యక్రమంలో ఏఐటీఎస్‌ వైస్‌చైర్మన్‌ చొప్పా ఎల్లారెడ్డి, రిజిస్ట్రార్‌ డాక్టర్‌.మల్లికార్జునరావు, ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

డీఈఓ వైఖరికి నిరసనగా ఆమరణ దీక్షకు సన్నద్ధం


సమావేశంలో మాట్లాడుతున్న ఐక్యవేదిక నాయకుడు ఎస్‌ఎండీ ఇలియాస్‌బాషా

కడప ఎడ్యుకేషన్‌ : ఉపాధ్యాయులను దుర్భాషలాడుతూ, అగౌరవంగా ప్రవర్తిస్తున్న ఈ డీఈఓ మాకొద్దు అనే నినాదంతో ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టేందుకు సన్నద్ధమవుతున్నారు. బుధవారం కడప ఉపాధ్యాయ భవన్‌లో ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక నాయకులు సమావేశం నిర్వహించి ‘ఉపాధ్యాయుల ఆత్మగౌరవం’ కోసం ఉద్యమ కార్యాచరణను ప్రకటించారు. ఇందులో జనవరి 9వ తేదీ నుంచి 19వ తేదీ వరకు వైఎస్సార్‌ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవితకు, ఉమ్మడి జిల్లా మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌ రెడ్డికి, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను కలిసి వినతి పత్రాలు అందజేయనున్నారు. జనవరి 23, 24 తేదీలలో మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ప్రతి పాఠశాలలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపనున్నారు. జనవరి 27 నుంచి 31వ తేదీ వరకు డీఈఓ కార్యాలయ ముట్టడికి సన్నద్ధత, ఫిబ్రవరి 1న డీఈఓ కార్యాలయం ముట్టడి, ఫిబ్రవరి 3, 4 తేదీలలో మహాత్మా గాంధీ, డాక్టర్‌ బీఆర్‌ అంబేద్కర్‌ విగ్రహాలకు వినతి పత్రాలు సమర్పించనున్నారు. అలాగే ఫిబ్రవరి 5వ తేదీ నుంచి 14వ తేదీ వరకు రిలే నిరాహార దీక్షలు, ఫిబ్రవరి 19న మాస్‌ క్యాజువల్‌ లీవ్‌, ఫిబ్రవరి 20 తేదీ నుంచి 28 తేదీ వరకు ఆమరణ నిరాహార దీక్షలకు ఉపాధ్యాయులను సన్నద్ధం చేయడం, మార్చి 1వ తేదీ నుంచి ఆమరణ నిరాహార దీక్షలు చేపట్టడం కార్యాచరణలో భాగంగా తెలిపారు. దీంతోపాటు ప్రతి ఆదివారం ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక సమావేశం ఉంటుందని అందులో ఉద్యమ తీరుతెన్నులను పునః సమీక్షించుకుంటామన్నారు. డీఈఓ మీనాక్షి జిల్లా వదిలి వెళ్లేంత వరకు ఉద్యమ కార్యాచరణ కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక ఉపాధ్యాయ సంఘం నాయకులు మోపూరి వెంకటశివారెడ్డి, గుజ్జల తిరుపాల్‌, ఇలియాస్‌ బాషా, లెక్కల జమాల్‌ రెడ్డి, వెంకట్రామిరెడ్డి, శ్యాంసుందర్‌ రెడ్డి, అబ్దుల్లా, నరసింహారావు, రామాంజనేయులు, రాధాకృష్ణమూర్తి, రామకృష్ణంరాజు, గంగరాజు, ఆంజనేయులు, హరికొండయ్య, పీవీ సుబ్బారెడ్డి, నాగేశ్వరరావు, సాజిద్‌, అంకాల్‌ కొండయ్య, నరసింహారెడ్డి, ఆవుల శ్రీనివాసులు, రమేష్‌ బాబు, శివశంకర్‌ రెడ్డి, ప్రవీణ్‌, చంద్రశేఖర్‌, శ్రీనివాస రెడ్డి, రామాంజనేయరెడ్డి, మదన్‌ మోహన్‌ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కృషి చేస్తాం


పాఠశాల ప్రిన్సిపల్‌కు ఫ్యాన్లు అందిస్తున్న సీఎంఓ సాయి రమేష్‌

కమలాపురం : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేస్తామని భారతి సిమెంట్‌ కార్పొరేషన్‌ ప్రైవేట్‌ లిమిటెడ్‌ (బీసీసీపీఎల్‌) సీఎంఓ సాయి రమేష్‌ తెలిపారు. బుధవారం స్థానిక జ్యోతి బా పూలే బీసీ వెల్ఫేర్‌ రెసిడెన్షియల్‌ స్కూల్‌ విద్యార్థులకు పలు సౌకర్యాలు సమకూర్చారు. 240 మంది విద్యార్థులకు మస్కిటో నెట్స్‌. అలాగే విద్యార్థుల కోసం కంప్యూటర్స్‌, ఫ్రిజ్‌, వాల్‌ మౌంటెడ్‌ ఫ్యాన్స్‌, కుర్చీలు, టేబుల్స్‌, అల్మారాలు, రెండు వాటర్‌ ట్యాంకులు, బాత్‌ రూం డోర్స్‌ వంటి సౌకర్యాలు కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తమ భారతి సిమెంట్‌ పరిశ్రమ సీఎస్‌ఆర్‌ నిధులతో దత్తత గ్రామాల్లో అనేక సౌకర్యాలు కల్పించామన్నారు. శుద్ధి నీటి యంత్రాలు, మరుగుదొడ్లు, బస్‌ షెల్టర్లు కూడా ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమ ఐఅండ్‌పీఆర్‌ చీఫ్‌ మేనేజర్‌ భార్గవ్‌ రెడ్డి, ప్రిన్సిపల్‌ నాగిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.